ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగంచేసు కోవాలి

◆ డీఎంహెచ్‌వో శశికళ ◆ గట్టు పీహెచ్‌సీలో మెగా హెల్త్‌మేళా

న్యూట్రిషన్ కిట్ అందజేస్తున్న జిల్లా వైద్యాధికారిణి శశికళ

గట్టు, అక్టోబర్ 3: ప్రభుత్వ వైద్యసేవలను రోగులు వినియోగించుకోవాలని జిల్లా వైద్యాధికారి శశికళ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మెగా హెల్త్‌మేళాను ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ హయాంలో ప్రభుత్వ దవాఖానలో అన్నిరకాల సేవలు అందుతున్నాయని స్పష్టం చేశారు. రోగులు ప్రైవేట్‌కు వెళ్లకుండా ప్రభుత్వ దవాఖానల్లోని సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనలక్ష్మి, ఎంపీటీసీ కృష్ణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్ధప్ప, జిల్లా ప్రోగ్రాం అధికారిణి స్రవంతి, సీహెచ్‌వో హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

మానవపాడు, అక్టోబర్ 3: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో శివప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 3, 5తరగతుల విద్యార్థుల దగ్గరకు వెళ్లి తెలుగు, చదవడం, రాయడం, ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం బాగుండడంతో ప్రతిరోజూ వంటలు రుచిగా చేయాలని ఆదేశించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని, బోధనలో కొత్త పద్ధతులు పాటిస్తూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఆదేశించారు. అనంతరం ఎంఈవోను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం బజారన్న, ఉపాధ్యాయులు రామేశ్వర్‌రెడ్డి, విజయమ్మ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో శివప్రసాద్

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

◆ తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం
◆ అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం

అయిజ రూరల్, అక్టోబర్ 3: పల్లెల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఇందుకు సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే అబ్రహం పేర్కొన్నారు. మండలంలోని నౌరోజీక్యాంపు, చిన్నతాండ్రపాడులో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఈడిగోనిపల్లిలో రూ.20లక్షలతో నిర్మించిన జీపీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలుకాని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేశారని పేర్కొన్నారు. రైతు సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, వ్యవసాయానికి 24గంటలు ఉచిత విద్యుత్‌ను అందించి రైతులను ప్రోత్సహిస్తున్నారన్నారు. ప్రతి పంచాయతీకి డంపింగ్ యార్డు, వైకుంఠధామం, పల్లెప్రకృతివనం, ట్రాక్టర్‌ను అందించి పల్లెలను ప్రగతి పథంలో నడిపిస్తున్నారని చెప్పారు. రైతులు పంటలసాగు తదితర వాటి వివరాలను చర్చించుకునేందుకు రైతువేదికలను ఏర్పాటు చేశారని తెలిపారు. నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం కల్పించాలన్న ఉద్దేశంతో సీఎం సహాయనిధి నుంచి ఆర్థికసాయం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు భద్రయ్య, పెద్ద సత్యన్న, లక్ష్మి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు రాముడు, బీచుపల్లి ఆలయ కమిటీ సభ్యుడు ఆంజనేయులు, ఉపసర్పంచులు, మహేశ్, తిమ్మలమ్మ, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉప్పలలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

ఈడిగోనిపల్లిలో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

బీఆర్ఎస్సే తెలంగాణకు శ్రీరామరక్ష

◆ అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం
◆ ఉప్పలలో రూ.15లక్షల సీసీరోడ్డు పనులకు భూమిపూజ

అయిజ, అక్టోబర్ 3: తెలంగాణ రాష్ట్రానికి బీఆర్ఎస్సే శ్రీరామరక్ష అని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పలలో రూ.15లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. అన్నపూర్ణ రాష్ట్రంగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో వేల కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టామన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. అయిజ మండలంలోని పలు గ్రామాల్లో సీసీ, బీటీరోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

ఎగ్జిబిషన్ వాల్‌పోస్టర్లు విడుదల

మల్దకల్, అక్టోబర్ 3: హైదరాబాద్‌లో 6,7,8వ తేదీల్లో నిర్వహించనున్న ఫొటోఅండ్‌వీడియో గ్రాఫర్ల ఎగ్జిబిషన్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మండలకేంద్రంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ నరేందర్‌శెట్టి ఆధ్వర్యంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులపాటు నిర్వహించే ఎగ్జిబిషన్‌కు మండలంలోని ప్రతి ఫొటో, వీడియో గ్రాఫర్లు తప్పకుండా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణయ్యగౌడ్, శ్రీను, తిమ్మప్ప, గోపాల్‌గౌడ్, చంటి, రాముడు, భాస్కర్, నర్సింహులు, శ్రీను, నాగేంద్ర పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత గ్రంథాల అందజేత

కేటీదొడ్డి, అక్టోబర్ 3: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక విషయాలపై అవగాహన పెంచుకోవాలని త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రభోద సేవా మండలాధ్యక్షుడు కృష్ణమూర్తి, ప్రసాద్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పలువురికి భగవద్గీత ఆచార్య ప్రభోనంద యోగీశ్వరుల గ్రంథాల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడి చిత్రపటం, భగవద్గీత పుస్తకాలను అందజేసి శ్లోకాలు వాటి భావాలు వినిపించారు. కార్యక్రమంలో సభ్యులు సాయి, వీరేశ్, వెంకటేశ్‌నాయుడు, రవిబాబు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ చిత్రపటం, భగవద్గీత అందజేస్తున్న సభ్యులు

అడ్మిషన్ పొందేందుకు 13వరకు అవకాశం

గద్వాలటౌన్, అక్టోబర్ 3: ఓపెన్ ఎస్ఎస్సీ, ఇంటర్‌లో చేరేందుకు అపరాద రుసుముతో ఈనెల 13వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు డీఈవో సిరాజుద్దీన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు బోనఫైడ్, ఆధార్ కార్డు, రెండుఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అయిజ, అక్టోబర్ 3: మండలంలోని వెంకటాపురం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ నరేందర్‌రెడ్డి తెలిపారు. వెంకటాపురం సబ్ స్టేషన్ పరిధిలోని 8 గ్రామాలకు విద్యుత్ సరఫరాలో పూర్తిగా అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత విద్యుత్ సరఫరా పునరుద్ధరించనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ రైతులు, విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో

అయిజ, అక్టోబర్ 3: కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. మంగళవారం ఇన్‌ఫ్లో 5,455 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 5,000 క్యూసెక్కులుగా నమోదైంది. ఎగువ నుంచి వచ్చే వరద ఆనకట్టపై నుంచి దిగువన ఉన్న సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ప్రధానకాల్వకు 455 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు కర్ణాటక ఆర్డీఎస్ డీఈ శాంతరాజు తెలిపారు. ప్రస్తుతం ఆర్డీఎస్ ఆనకట్టలో 8.7 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటకలోని టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ఇన్‌ఫ్లో 2,160 క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో 9,728 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 54.267 టీఎంసీల నీటినిల్వ ఉంది. 1,633 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి గానూ ప్రస్తుతం 1,617.37 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు టీబీ డ్యాం సెక్షన్ అధికారి తెలిపారు.

రాయల్‌గా..కలర్‌ఫుల్‌గా..

ధరూరు, అక్టోబర్ 3: పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం ఎల్ఐసీ, హెచ్ఎఫ్ఎల్ ఎన్జీవో సంస్థ నిర్మిస్తున్న మురుగుదొడ్ల పనులు వేగంగా సాగుతూ.. ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. రూ.3లక్షలతో మండలంలోని ఎంపీపీ పాఠశాలలకు నిర్మిస్తున్న మరుగుదొడ్లు అత్యున్నతమైన సౌకర్యాలు, స్వచ్ఛభారత్ లక్ష్యంగా చేస్తున్న ఈ పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. రాయల్‌గా కనిపించే కలర్‌ఫుల్ టైల్స్‌తో చకచకా మెరుస్తున్నాయి. చక్కని పెయింటింగ్‌తో టాయిలెట్స్‌ను ఇంత అందంగా నిర్మిస్తారా అనే విధంగా తయారవుతున్నాయి. మండలకేంద్రంలోని ఎంపీపీఎస్‌లో నిర్మించిన మరుగుదొడ్డికి పెయింటింగ్, బోర్డు రాసే పనులు కొనసాగుతున్నాయి. డోర్లు అమర్చారు. ఇంకా వినియోగంలోకి తేవడమే లేటు అనే విధంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి.

మండలకేంద్రంలోని ఎంపీపీఎస్‌లో మరుగుదొడ్డికి కొనసాగుతున్న పెయింటింగ్ పనులు

ఓటు హక్కుపై అవగాహనఅవ సరం

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న రంజిత్‌కుమార్

వడ్డేపల్లి, అక్టోబర్ 3: అమూల్యమైన ఓటును వినియోగించుకోవడానికి అవగాహన కలిగిఉండాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ అన్నారు. మున్సిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లోని డిగ్రీ కళాశాలలో మంగళవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి అలంపూర్ నియోజకవర్గం సమన్వయకర్త నాగేశ్‌యాదవ్ అధ్యక్షతన విద్య–ఓటు–విద్యార్థి అనే అంశంపై ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వాడి చిత్తశుద్ధి ఉన్న నాయకత్వాన్ని ఎన్నుకునేదిశగా యువత, విద్యార్థులు కీలకపాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో వీరేశ్, జిల్లా కార్యదర్శి లవన్న, నాయకులు రంగస్వామి, కిశోర్, రవియాదవ్, రాముడు, ప్రేమరాజ్ పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

మానవపాడు, అక్టోబర్ 3: ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రిజ్వాన మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలైన నోటిక్యాన్సర్, రొమ్ము, రక్తహీనత, రుతుస్రావం, మోనోపాజ్, మూత్రనాల సమస్యలు, మానసిక స్థితి సమస్యలు వంటి వాటికి 51మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు వైద్యురాలు రిజ్వాన తెలిపారు. ప్రతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈ పరీక్షలు నిర్వహిస్తామని డాక్టర్ తెలిపారు.



మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రిజ్వాన